**దుర్గాభవానీ అమ్మవారికి ఘనంగా ఫలపంచామృతాభిషేకం**

**వైభవంగా ప్రారంభమైన వసంత నవరాత్రోత్సవాలు**



5 లో


# మనం

## కరీంనగర్

జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్

బుధవారం | 22 | మార్చి | 2023 | పేజీలు : 7


## మనకు బలం కెసిఆర్..

# మనమంతా ఆయన బలగం

**భావి తరాల భవిష్యత్ నిర్ణయించేది బిఆర్ఎస్**

**కెసిఆర్ ను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలదే**

**బిఆర్ఎస్ సమావేశంలో మంత్రి గంగుల కమలాకర్**





కరీంనగర్ బ్యూరో, మార్చి 21 (మనం న్యూస్)ః భావి తరాల భవిష్యత్ నిర్ణయించేది బిఆర్ఎస్ మాత్రమే.. మనకు బలం కెసిఆర్ అయితే.. మనమంతా కెసిఆర్ బలగం.. యనను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలమైన మనపైనే ఉంది..' అంటూ బిసి సంక్షేమం, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన భారత రాష్ట్ర సమితి పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ భూమిపై కోట్లు సంపాదించినా తృప్తి ఇవ్వదని..అందరూ కలిసి ఉండడంలోనే తృప్తి అనే ఉద్ధేశ్యంతోనే ఈ సమావేశాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. భవిష్యత్ కు బంగారు బాటలు వేయాలంటే కార్యకర్తలంతా కెసిఆర్‌ను మరింత బలోపేతం చేయాలన్నారు. బడుగు బలహీన వర్గాల పార్టీ బీఆర్ఎస్ అని , భవిష్యత్ అంతా బీఆర్ఎస్ దేనన్నారు. ఎన్నో కులాలు, మతాల వారు ఉన్నా కలిసి మెలిసి ఉండేది బిఆర్ఎస్ మాత్రమే అన్నారు. తండ్రి కొడుకుల మధ్య తేడాలు వస్తే ఇంట్లోనే మాట్లాడుకొని ఏ విధంగా పరిష్కరించుకుంటామో, పార్టీలో కూడా అలాగే మనలో మనమే పరిష్కరించుకుందామని కార్యకర్తలనుద్ధేశించి చెప్పారు. మనసులో కక్షలు పెంచుకొని ఒకరికొకరు దూరం కావద్దని అందరూ ఐక్యంగా ఉండి పార్టీని మరింత ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని గొప్ప పథకాలు తెలంగాణలో ఉన్నాయని, యావత్ దేశం చూపు పడే విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోన్న బిఆర్ఎస్‌ను రాబోయే తరానికి కూడా అందించే విధంగా ప్రతి కార్యకర్తల కృషి చేయాలన్నారు. ఆడబిడ్డల కళ్ళలో ఆనందం చూడాలని కెసిఆర్ చూస్తే..మోడీ మాత్రం ఆడబిడ్డలకు కన్నీళ్లు పెట్టిస్తున్నాన్నారు. ఆడబిడ్డ కన్నీరు పెడితే అరిష్టం అని, తెలంగాణ ఆడబిడ్డ ను ఏడిపించడం మోడీ ప్రభుత్వానికి మంచిది కాదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రతి కార్యకర్తల హక్కుదారుడని, ఈ ఆత్మీయ సమ్మేళనాల ద్వారా ప్రతి కార్యకర్త దగ్గరకు వస్తామని, సూచనలు చేయండని, తప్పులు జరిగితే సవరించుకుంటామని గంగుల పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్ లు ఢిల్లీ పార్టీలు అని, వాళ్ల అధికారంలోకి వస్తే మన వనరులను దోచుకెళ్తారన్నారు.

---

**వడగండ్ల వానతో పంట నష్టపోయిన**

## ప్రతి రైతును ఆదుకుంటాం

**నష్ట నివేదిక త్వరగా అందించాలి**

**రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు వినోద్ కుమార్**

3 లో



# మెగా టెక్స్‌టైల్ పార్కును సిరిసిల్లలో ఏర్పాటు చేసే బాధ్యత బండిదే

**ఎఐసిసి సభ్యులు పొన్నం ప్రభాకర్**

రాజన్న సిరిసిల్ల, మార్చి 21 (మనం న్యూస్)ః కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన మెగా టెక్స్‌టైల్ పార్కును సిరిసిల్లలోనే ఏర్పాటు చేసే బాధ్యత స్థానిక ఎంపి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ పై ఉందని ఎఐసిసి సభ్యులు, మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక మరమగ్గాలు సిరిసిల్లలో ఉన్నాయని, ఈ నేపథ్యంలో మెగా టెక్స్‌టైల్ పార్కు ఈ ప్రాంతంలోనే ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయంలో ఎంపి సంజయ్ చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే వరంగల్ లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఎంపిలుగా బోయినపల్లి వినోద్ కుమార్, బండి సంజయ్ లు ఈ ప్రాంతానికి ఒరగబెట్టిందేమీ పొన్నం విమర్శించారు. తన హయాంలోనే కేంద్రీయ విద్యాలయంతో పాటు, బీడీ కార్మిక వైద్యశాలను తీసుకువస్తే కనీసం వాటి నిర్మాణం కోసం స్థలాన్ని కూడా కేటాయించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ నాయకులు చెబుతున్నట్టు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధి



కోసం చేసిన పనులపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. సిరిసిల్లలో మెగా టెక్స్‌టైల్ పార్క్ కోసం కాంగ్రెస్ పార్టీ ముందుండి పోరాడుతుందని, అందుకు సిరిసిల్లలోని కార్మికులంతా తమతో కలిసి రావాలని కోరారు. ఈ సమావేశంలో డిసిసి అధ్యక్షులు ఆది శ్రీనివాస్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, నాగుల సత్యనారాయణ గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆకునూరి బాలరాజు, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు, మైనార్టీ సెల్ నాయకులు ఎండి రియాజ్, అన్ని మండలాల నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




## గాయత్రి విద్యానికేతన్‌లో ఘనంగా ముందస్తు ఉగాది వేడుకలు

**భావి తరాలకు పండుగల విశిష్టతలను తెలియజేయాలి**

**తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మచార్యులు**



పెద్దపల్లి, మార్చి 21(మనం ప్రతినిధి): పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌లో మంగళవారం శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు మరియు తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మచార్యులు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ భావి తరాలకు పండుగ విశిష్టతలను తెలియజేయాల్సిన బాధ్యత మనపై ఉందని, ఉగాది పండుగ యొక్క విశిష్టతను విద్యార్థినీ విద్యార్థులకు చక్కగా వివరించారు. ఉగాది పచ్చడి అనేది షడ్రుచుల సమ్మేళనం అని, ఇది మానవ జీవితంలో ఎదుర్కొనే అన్ని రకాల అనుభూతులను ప్రతిబింబిస్తుందని అన్నారు. అంతేకాక పిల్లలకి సంపదను ఇవ్వడం ముఖ్యం కాదని, సంస్కారం నేర్పించడం చాలా ముఖ్యమన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప క్రమశిక్షణ కలిగిన పౌరులుగా జీవిస్తారని, పిల్లలకి పాఠశాల స్థాయి నుండే మన సంస్కృతి సాంప్రదాయాలు, పండగల విశిష్టతను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీశ్రీనివాస్‌లు పిల్లలకి ముందస్తు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ అందరికి ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# శాశ్వత గోదాం నిర్మాణం చేపట్టకపోతే ఆందోళన చేస్తాం

**జిల్లా కేంద్రంలో సివిల్ సప్లై శాశ్వత గోదాం నిర్మాణం చేపట్టాలి**

**స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్‌కు వినతి ..**

**ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సునిల్**



పెద్దపల్లి, మార్చి 21(మనం ప్రతినిధి): పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సివిల్ సప్లై శాశ్వత గోదాం నిర్మాణం చేపట్టాలని, శాశ్వత నిర్మాణం చేపట్టకపోతే దశల వారిగా ఆందోళనలు చేపడుతామని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి, అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునిల్ వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత కొన్ని ఏళ్లుగా మార్క్‌షెడ్ అద్దె గోదాములో సివిల్ సప్లై ప్రజాపంపిణీ సరుకులు, ఎగుమతి, దిగుమతి కొనసాగుతుందని, జిల్లా కేంద్రం ఏర్పడిన తర్వాత శాశ్వత గోదాంలు వెంటనే నిర్మించాలన్నారు. గోదాములు శిథిలావస్థకు చేరుకుందని, ప్రజా పంపిణీ సరుకులు వర్షకాలంలో ఎగుమతి, దిగుమతి చేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. సివిల్ సప్లై ఎఐటియూటీసీ ఆధ్వర్యంలో, పోరాటాలు నిర్వహించడం వలన రాఘవాపూర్ గ్రామ శివారులో, రెండు ఎకరాల ప్రభుత్వ భూములు కేటాయించారని, కానీ హద్దులు చూపెట్టడం మరిచిపోయిందని, ఆకారణంగా భూమి అన్యాక్రాంతం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా పంపిణీ సక్రమంగా నిర్వహణ ఎగుమతి, దిగుమతి ఎలాంటి అటంకాలు లేకుండా జరగడానికి శాశ్వతంగా జిల్లా కేంద్రంలో సివిల్ సప్లై గోదాం నిర్మాణానికి ప్రజా ప్రతినిథులు, ప్రభుత్వ అధికారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శాశ్వతంగా గోదాం నిర్మాణం చేపట్టకపోతే దశలవారిగా ఆందోళన కార్యక్రమాలు జిల్లా కేంద్రంలో చేపడుతామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఐటియూసీ జిల్లా ఉపాధ్యక్షులు కడారి తిరుపతి, పెద్దపల్లి మున్సిపల్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, బూత్కూరి పోచమల్లు, నర్ర సతీష్, కందుల శ్రీనివాస్, కొమ్ము తిరుపతి, బెల్లపు శ్రీనివాస్, కడారి చంద్రయ్య, పెసర లింగయ్య, దాడి మల్లయ్య, కడారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా న్యూ మిలీనియం స్కూల్ వార్షికోత్సవ వేడుకలు



జమ్మికుంట, మార్చి 21 (మనం న్యూస్): జమ్మికుంట పట్టణంలోని న్యూ మిలీనియం స్కూల్స్ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం స్థానిక పివిఆర్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల చైర్మన్ ముసిపట్ల తిరుపతిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా కౌశిక్ రెడ్డితో పాటు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ అతి తక్కువ సమయంలోనే ఎంతో ఉన్నత స్థానానికి ఎదిగిన న్యూ మిలీనియం స్కూల్స్ యజమాన్యాన్ని అభినందించారు. ఈ స్థాయికి ఎదగడానికి పాఠశాల చైర్మన్ ముసిపట్ల తిరుపతిరెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. కొంతమంది కావాలని న్యూ మిలీనియం స్కూల్స్ యజమాన్యాన్ని వేధిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఆ పాఠశాలల జోలికి వెళ్లే వారు తాను ఉన్నానని మర్చిపోవద్దని, చిల్లర రాజకీయాలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్న కోటి, కౌన్సిలర్ శ్రీపతి నరేష్, నాయకులు దిలీప్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతలను ఆదుకోవాలని బిజెపి ఆందోళన

**- ఎకరాకు రూ.80 వేలు చెల్లించాలి**

**- కేంద్ర ప్రభుత్వ ఫసల్ బీమా యోజన పథకం వెంటనే అమలు చేయాలి**

**: బిజెపి జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి**

కరీంనగర్, మార్చి 21 (మనం న్యూస్): అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని, పంట నష్టపోయిన రైతులకు ఏకరాకు 80వేల రూపాయల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేస్తూ బిజెపి జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో, అకాల వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని కెసిఆర్ ప్రభుత్వం ఏనాడు ఆదుకున్నది లేదని, పంట నష్టపోయి రైతు కన్నీరు పెడితే ఓదార్చిన పాపాన పోలేదని విమర్శించారు. పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడానికి తొమ్మిదేళ్లుగా ఆలోచన చేయడం లేదని, కనీసం నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడానికి కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం తీసుకు వచ్చిన ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు



చేయకుండా రైతులను అరగోస పెడుతుందన్నారు. ప్రతి ఏటా ప్రకృతి వైపరీత్యాల కారణంగా అనేక ప్రాంతాల్లో రైతాంగం పంట నష్టపోతుంటే తొమ్మిదేళ్లుగా కెసిఆర్ ప్రభుత్వం ఆదుకున్న దాఖలాలు ఎక్కడా లేవన్నారు. ప్రకృతి వైపరీత్యాలు ఇతర కారణాలవల్ల పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడానికిబిజెపి మోడీ ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకం తీసుకొచ్చిందన్నారు. అయితే రాష్ట్రంలో ఈ పథకం అమలు కాకుండా కేసీఆర్ ప్రభుత్వం మోకాలడ్డుతుందని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా కోత దశలో రాళ్ల వాన పడటంతో పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని ,మిర్చి, మామిడి, ఖరబూజ, మొక్క జొన్న వంటి పంటల కు తీవ్ర నష్టం ఏర్పడడంతో అన్నదాత తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.80,000 రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలని, రైతులకు బ్యాంక్ రుణాలు పూర్తిగా మాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా వడ గళ్ళ వాన తీవ్రత పై , పంట నష్ట వివరాలపై జిల్లా యంత్రాంగం రెవెన్యూ, పంచాయతీ రాజ్, వ్యవసాయ శాఖలతో కలసి వేగంగా సర్వే చేపట్టి నష్టపోయిన రైతుల వివరాలు ప్రభుత్వానికి పంపి నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ డి.శంకర్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, కొరటాల శివరామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ కళ్లెం వాసుదేవరెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు మాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి మంజులవాణి, జిల్లా ఆఫీస్ సెక్రెటరీ మాడుగుల ప్రవీణ్, జిల్లా అధికార ప్రతినిధులు బొంతల కళ్యాణ్ చంద్ర, జానపట్ల స్వామి, అలివేలు సమ్మిరెడ్డి,సంకిడి శ్రీనివాసరెడ్డి, ఎడమ సత్యనారాయణ రెడ్డి,ఊగిలే సుధాకర్ పటేల్, సింగిరెడ్డి కృష్ణారెడ్డి, జాడి బాల్రెడ్డి, అన్నాడి రాజిరెడ్డి, బండ రమణారెడ్డి, పుప్పాల రఘు, ముత్యాల జగన్ రెడ్డి, మాడ గౌతంరెడ్డి, గుర్రాల లక్ష్మారెడ్డి, నాగసముద్రం ప్రవీణ్, నరహరి లక్ష్మారెడ్డి, మాడిశెట్టి సంతోష్, రామిడి ఆదిరెడ్డి, లక్ష్మీనారాయణ, రమణారెడ్డి, రవీందర్ రెడ్డి,మద్గూరి సమ్మిరెడ్డి, సొల్లు అజయ్ వర్మ, చిట్టారెడ్డి లక్ష్మణరావు, తూర్పాటి రాజు, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వడగండ్ల వానతో పంట నష్టపోయిన

# ప్రతి రైతును ఆదుకుంటాం



### నష్ట నివేదిక త్వరగా అందించాలి

### రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు వినోద్ కుమార్

కరీంనగర్ బ్యూరో, మార్చి 21 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లాలో వడగండ్ల వానతో పంట నష్టపోయిన ప్రతి ఒక్క రైతును ఆదుకుంటామని, రైతులు అధైర్య పడవద్దని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని వెంకట్రావుపల్లి, రాంచంద్రాపూర్, దత్తోజిపల్లి, చొప్పదండి మండలం మంగళపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో కురిసిన వడగండ్ల వానతో నష్టపోయిన వరి, మొక్కజొన్న, మామిడి, వాటర్ మిలన్ ,ఇతర పంటలను జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్, చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, అధికారులతో కలిసి వినోద్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వడగండ్ల వాన కురియడంతో పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందన్నారు. దాదాపుగా 21వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలను వేసి వడగళ్లవానతో నష్టపోయిన దాదాపు 18వేల మంది రైతులను తక్షణం ఆదుకునే దిశగా చర్యలను వేగవంతం చేయనున్నట్లు చెప్పారు. పంటనష్ట నివేదికను తక్షణం సిద్ధం చేసి సమర్పించాల్సిందిగా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించినట్లు, నివేదిక అందిన వెంటనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావానికి మునుపు రాష్ట్రంలో నీటినిల్వకు సరైన అవకాశాలు లేక నీటిని సముద్రంలో వృధాగా వదలడంతో ఎడారిని తలపించేలా తెలంగాణ ఉండేదని, అలాంటి స్థితి నుండి అద్భుతమైన పంటలను పండించుకునేలా ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టేలా రాష్ట్రంలో ప్రాజెక్టులను నిర్మించుకుని, వందలాది చెరవులను నింపుకుని సాగునీటి వనరులను పెంచుకున్నట్లు తెలిపారు. సృష్టి విపత్తుకు ఎవరు ఎం చేయలేని స్థితి నెలకొందని, ప్రభుత్వం తరపున ప్రతిరైతును ఆదుకుంటామని రైతులు అధైర్యపడవద్దని తెలిపారు. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన రైతు రాంచంద్రారెడ్డి, దత్తోజీపేట గ్రామానికి చెందిన గట్ల జితేందర్ రెడ్డి, రేవుల తిరుపతి, లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన అంజిరెడ్డి మరికొంత మంది రైతుల నష్టపోయిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ప్రియాంక, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, తహసీల్దార్లు, యంపిడిఓలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## రైతులు అధైర్య పడవద్దు.. అండగా ఉంటాం

### ఎమ్మెల్యే రసమయి



తిమ్మాపూర్, మార్చి 21 (మనం న్యూస్): అకాల వర్షం, వడగండ్ల కారణంగా పంటలు నష్ట పోయిన అన్నదాతలు అధైర్యపడవద్దని, రాష్ట్ర ప్రభుత్వం రైతన్నలందరికీ అండగా ఉంటుందని మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ రసమయి బాలకిషన్ భరోసా కల్పించారు. కరీంనగర్ జిల్లా మాన కొండూర్ నియోజకవర్గంలో ఇటీవల కురిసిన అకాల వర్షం కారణంగా దెబ్బతిన్న పంటలతో పాటు నేల కూలిన చెట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట చేతికి అందే సమయంలో ప్రకృతి కన్నెర్ర చేయడం చాలా బాధాకరం అని, ఆరుగాలం శ్రమించి పండించిన పంట నష్టపోయిన అన్నదాతలకు అండగా బిఆర్ఎస్ ప్రభుత్వం ఉంటుదన్నారు. వెంటనే పంట నష్టంపై అంచనా వేసి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేయాలని రసమయి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు, సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వార్షిక పరీక్షల సన్నాహక సదస్సు



కరీంనగర్, మార్చి 21 (మనం న్యూస్): నగరంలోని 20వ డివిజన్ ఆరెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వార్షిక పరీక్షలకు సన్నాహం అనే అంశంపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ధనపురి సాగర్ మాట్లాడుతూ ఆత్మవిశ్వాసమే విజయానికి తొలిమెట్టని, విద్యార్థులు వార్షిక పరీక్షలు అనగానే భయపడుతూ ఒత్తిడికి లోనుకాకూడదని తెలిపారు. సహచర విద్యార్థులతో పోల్చుకోవడం, పరీక్షల గురించి అతిగా ఆలోచించడం వంటివి ఒత్తిడిని పెంచుతాయని, పరీక్షల గురించి అతిగా ఆలోచించడం మానేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందించారు. వార్షిక పరీక్షలలో 9.6 జిపిఎ నుండి 10 జీపీఎ సాధించిన వారికి సంస్థ పక్షాన 2,016 రూపాయల నగదు పారితోషికం అందించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కళావతి , ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## వివాదం పరిష్కరిస్తామని.. ఉన్న ఆస్తిని కాజేశారు

### బిజెపి నాయకుల తీరుపై బండి సంజయ్‌కు వృద్ధురాలి ఫిర్యాదు

### న్యాయం చేయాలని విజ్ఞప్తి



రాజన్న సిరిసిల్ల, మార్చి 21, (మనం న్యూస్): తమ ఆస్తి వివాదాన్ని పరిష్కరిస్తామని నమ్మబలికి ఉన్న ఆస్తిని కాజేసిన ఇద్దరు బిజెపి నాయకుల నుంచి తన ఆస్తిని తనకు ఇప్పించాలని కోరుతూ ఓ వృద్ధురాలు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, స్థానిక ఎంపి బండి సంజయ్‌కుమార్‌కు మొరపెట్టుకుంది. సిరిసిల్ల పట్టణానికి చెందిన షమీ సుల్తానా అనే మైనార్టీ వృద్ధురాలు మంగళవారం మీడియా ముందు తన గోడు వెళ్లబోసుకుంది. ఆస్తి గురించి తమ కుటుంబ సభ్యుల మధ్య కొనసాగుతున్న వివిదాన్ని పరిష్కరించాలని పట్టణానికి చెందిన బిజెపి నాయకులు ఠాకూర్ రాజాసింగ్, మేకల కమలాకర్‌లను గతంలో సంప్రదించినట్లు తెలిపారు. తాము పరిష్కరిస్తామని చెప్పిన వారు తంగళ్ళపల్లి మండలం సారంపల్లిలో ఉన్న ఇల్లు, ఆరు గంటల స్థలాన్ని వారి పేర్లకు మార్చాలని, సమస్య తీరిన తదుపరి తిరిగి తన పేరిట మార్పిడి చేయిస్తామని నమ్మబలికారని చెప్పింది. వారి మాటలను నమ్మి తన సొంత ఖర్చులతో తన ఆస్తి మొత్తాన్ని వారి పేరిట రిజిస్టర్ చేసినట్లు తెలిపింది. వీటితో పాటు సారంపల్లి టెక్స్ టైల్ పార్కులోని ఇంటికి సంబంధించిన పత్రాలను తీసుకొని వారికి అమ్మినట్లుగా బాండు పేపర్ రాసుకోవడమే కాకుండా తన ఆస్తి పత్రాలు కూడా వారి వద్ద ఉంచుకున్నట్లు వృద్ధురాలు వాపోయింది. సమస్యలు సద్దుమణిగిన అనంతరం, తన ఆస్తి తన పేరిట మార్చాలని కోరితే రిజిస్ట్రేషన్ చేయకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఆస్తి వివాదం విషయంలో పంచాయతీ నిర్వహించిన ప్రతిసారి తన వద్ద రాజాసింగ్, కమలాకర్‌లు డబ్బులు వసూలు చేశారని తెలిపింది. ఈ విషయంలో పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్లు, అయినప్పటికీ తనపైనే తప్పుడు కేసులు పెడుతామని వారిరువురు బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయింది. వారి బారి నుంచి తనను కాపాడడంతో పాటు తన ఆస్తిని తనకు ఇప్పించాలని కన్నీటి పర్యంతమైంది. వృద్ధురాలినైన తన పరిస్థితిని గమనించి తన ఆస్తిని తిరిగి ఇప్పించి న్యాయం జరిగేలా కృషి చేయాలని బండి సంజయ్‌కు విజ్ఞప్తి చేసింది.

## రోడ్డు గుంతలమయమై ప్రజలు అవస్థలు పడుతున్నా పట్టించుకోరా..?

### కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి



ఇల్లందకుంట, మార్చి 21 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి రోడ్డు పూర్తిగా గుంతలమయమై ప్రజలు నానా అవస్థల పాలవుతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోరా..? అని బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కంకణాల రవీందర్ రెడ్డి ప్రశ్నించారు. అస్తవ్యస్తంగా తయారైన రోడ్డు కారణంగా వాహనాల మాటలా ఉంచి, వర్షం పడిన సమయంలో నడిచి వెళ్లరాని పరిస్థితి నెలకొందన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలో మైక్రోస్టేషన్ వద్ద రోడ్డు పూర్తి అధ్వాన్నంగా తయారైనా సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదని విమర్శించారు. శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్స వాలు సమీపిస్తున్నందున అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్న తరుణంలో తీవ్ర ఇబ్బందులేర్పడుతాయన్నారు. రోడ్డు గుంతలమయమై రెండు నెలల నుండి మురికి నీరుతో నిండిపోయిందని, ఇప్పటికైనా గ్రామపంచాయతీ పాలకవర్గం, అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టడంతో పాటు మురుగు కాలువలను సరిచేసి ప్రయాణికుల ఇబ్బందులను తీర్చాలని రవీందర్ రెడ్డి డిమాండ్ చేశారు.

## శోభాకృత్ నామ సంవత్సర శుభాకాంక్షలు



వీణవంక-మార్చి 21(మనం న్యూస్): నేడు శోభాకృత్ తెలుగు నూతన సంవత్సరం (ఉగాది పండుగ)ను పురస్కరించుకొని మండలం లోని దేశాయిపల్లి గ్రామ సర్పంచ్ గాలేటి జ్యోతి సురేందర్‌రెడ్డి గ్రామస్తులకు, మిత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులకు మంచి పంటలు పండాలని, విద్యార్థులు ఉత్తమఫలి తాలు సాధించాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసం తోషాలతో ఉండాలని అన్నారు.

# పోషన్ పక్వాడ్ సమావేశం



ధర్మపురి, మార్చి 21 మనం న్యూస్ : జగిత్యాల జిల్లా ధర్మపురి ప్రాజెక్ట్ కార్యాలయంలో పోషన్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా సూపర్ వైజర్స్ మాట్లాడుతూ ప్రాజెక్ట్ పరిధిలోని టీచర్స్ అందరికి 15 రోజులు చేయవలసిన అవగాహన కార్యక్రమాలు,ఈ పోషన పక్షంలో భాగంగా చిరుధాన్యాల ప్రాముఖ్యత గురించి,పోషకాహారం,పరిసరాల పరిశుభ్రత,1000 రోజుల ప్రాముఖ్యత గురించి,ఆరోగ్యవంతమైన పిల్లలకు ఫోటీల నిర్వహించాలని,పెరుగుదల పర్యవేక్షణ చేయాలని, ప్రతి ఇంటిలో కిచెన్ గార్డెన్ పెంచడం మరియు ఏ ఒక్కరిలో రక్తహీనత, పోషకాహారలోపం లేని గ్రామముగా తీర్చిదిద్దాలని వారికి రోజు వారి కార్యక్రమాల వివరించడం జరిగినది. ఇందులో భాగంగా సూపర్ వైజర్స్,అంగన్వాడి టీచర్స్,పోషన్ అభియాన్,బ్లాక్‌కో ఆర్డినేటర్ పాల్గొనడం జరిగినది.

## ముత్తారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన పెద్దపల్లి డిసిపి వైభవ్ గైక్వాడ్



ముత్తారం,మార్చి 21 మనం న్యూస్ : ముత్తారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను మంగళవారం పెద్దపల్లి డిసిపి వైభవ్ గైక్వాడ్ ఆకస్మికంగా తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ చుట్టుపక్కల క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. అదేవిధంగా సిబ్బందితో పలు విషయాలు మాట్లాడి సూచనలు ఇవ్వడం జరిగింది. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని రికార్డ్స్‌ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో గౌరవప్రదంగా మార్యదగా ప్రవర్తించి వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకొని వెంటనే వారికి తగిన సహాయ సహకారాలను అందించాలని చెప్పడం జరిగింది. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటడం జరిగింది. వారి వెల గోదావరిఖని ఏసిపి గిరిప్రసాద్,మంథని సీఐ గడి కొప్పుల సతీష్ ,ముత్తారం ఎస్సై భేతి రాములు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్నాలో పాల్గొన్న బిజేపి నాయకులు



వీణవంక- మార్చి 21 (మనం న్యూస్): అకాల వర్షానికి నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం అందించాలని బిజేపి పార్టీ ఆధ్వ ర్యంలో మంగళవారం కలెక్టరేట్ ముందు రైతులకు మద్దతుగా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల బిజేపి పార్టీ నాయకులు ,కార్యకర్తలు భారీగా తర లివెళ్లారు. ఈ కార్యక్రమం లో హుజురాబాద్ అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి, నాయకులు మడూరి సమ్మిరెడ్డి, నరసింహరాజు,, పొన్నాలఅనిల్, సంధి సురేందర్‌రెడ్డి,మారంతిరుపతిరెడ్డి, సురేందర్‌రెడ్డి, మద్దుల ప్రశాంత్, గోవిందరెడ్డి, శ్రీనివాస్,వెంకన్న, గెల్లు ఓంప్రకాష్ ,గోపినాధ్ తదితరులు పాల్గొన్నారు.

# మైదం బండ గ్రామానికి చెందిన చిన్నారి హృతికను పరామర్శించిన జెడ్పీ చైర్మన్

### హృతిక వైద్యసేవలపై ఆరా తీసిన పుట్ట మధుకర్




ముత్తారం,మార్చి 21 మనం న్యూస్ : ముత్తారం మండలంలోని మైదంబండ గ్రామానికి చెందిన చిన్నారి,వైద్యసేవల గురించి అధైర్యపడవద్దని,నయం అయ్యే వరకు అండగా ఉంటామని బిఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇంచార్జీ,పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ హృతిక తల్లిదండ్రులను భరోసా కల్పించారు. హైదరబాద్‌లోని రావూస్ ఈఎన్‌టి ఆస్పత్రిలో వినికిడి లోపంతో వైద్యచికిత్స పొందుతున్న ముత్తారం మండలం మైదబండకు చెందిన మంథని హృతికను ఆయన పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గత కొద్ది నెలల క్రితం వినికిడి లోపంతో బాధపడుతున్న విషయాన్ని చిన్నారి తల్లిదండ్రులు జెడ్పీచైర్మన్ పుట్ట మధుకర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి హైదరాబాద్‌లోని ప్రముఖ ఈఎన్‌టి రావూస్ ఆస్పత్రికి చిన్నారిని స్వయంగా తీసుకెళ్లి వైద్యపరీక్షలు చేయించారు. అలాగే హైదరాబాద్‌లో హృతిక తల్లిదండ్రులకు వసతి కల్పించి ఆస్పత్రిలో వైద్యసేవలు అందించేలా ఏర్పాట్లు చేశారు. కాగా మంగళవారం హృతికతో పాటు ఆమె తల్లిదండ్రులను ఆయన కలిసి వైద్య సేవలు, చిన్నారి ఆరోగ్య పరిస్థితిని అడిగా తెలుసుకున్నారు. గత కొద్ది రోజులుగా అందుతున్న వైద్య చికిత్సతో చిన్నారి హృతికలో మార్పు వచ్చిందని,చిన్నారికి వినికిది సమస్య కొంత మేర నయం అయిందని తల్లిదండ్రులు జెడ్పి చైర్మన్ కు వివరించారు. ఈ క్రమంలో చిన్నారి విషయంలో ఎలాంటి బాధపడవద్దని,పూర్తిగా నయం అయ్యే విధంగా వైద్య చికిత్స అందించేలా చూస్తామని ఆయన హృతిక తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు.

## సామాజిక సేవలో విజయ్‌కి ప్రత్యేక గుర్తింపు

### విజయ్ సేవలు అభినందనీయం





పెద్దపల్లి, మార్చి 21(మనం ప్రతినిధి): యువత, ఉద్యోగాలు, వివిధ రంగాలలో ఉన్నత స్థాయిలో స్థిరపడినవారు తోటి వారికి ఉపయోగపడే విధంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తే ప్రజల నుండి ప్రత్యేక గుర్తింపు వస్తుందని పెద్దపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి సర్పంచ్ గాండ్ల మల్లేశం అభిప్రాయపడ్డారు. బ్రాహ్మణపల్లి గ్రామంలోని పోచమ్మ దేవాలయం ఆధునీకరణ, ఫ్లోరింగ్, సీసీ రోడ్ల నిర్మాణ పనులను స్వంత ఖర్చులతో చేపట్టిన అదే గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్మీ జవాన్ మేకల విజయ్‌కుమార్ యాదవ్‌ను నారాయణదాసు అశోక్ ఆధ్వర్యంలో మంగళవారం అభినందన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నారాయణదాసు అశోక్ మాట్లాడుతూ సమాజంలో వ్యక్తులు చేసే మంచి పనులు స్థిర స్థాయిలో నిలిచిపోతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. స్వంత డబ్బులు వెచ్చించి పోచమ్మ ఆలయానికి అభివృద్ది చేసిన విజయ్‌ను అభినందించారు. విజయ్‌ని స్ఫూర్తిగా తీసుకొని సామాజిక సేవకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం విజయ్‌ను గ్రామస్థులు అభినందించారు. పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను బహుకరించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్, పెద్దసంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు. తన తండ్రి మేకల పోషం స్మారకార్థం గుడిని బాగు చేయాలనే సంకల్పంతో చేసినట్లు విజయ్ తెలిపారు.

# నేడు శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పంచాంగశ్రవణం



వీణవంక-మార్చి 21(మనం న్యూస్): మండలంలోని మామిడాలపల్లి గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నేడు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మ ధ్యాహ్నం ఒంటిగంటకు పంచాంగశ్రవణం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు సంతోష్‌చార్యులు, నరసింహచార్యులు తెలిపారు. గ్రామస్థులు,పరిసరగ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్ర మంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ గాదె రమణారెడ్డి పాల్గొన్నారు.

## లబ్దిదారునికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



మంథని,మార్చి 21 మనం న్యూస్ : మంథని మండలం చిన్న ఓదాల గ్రామానికి చెందిన దాసరి రాజయ్య ఎస్/ఓ లస్మయ్య ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా వారికి 22 వేల రూపాయల చెక్కు మంజూరు కావడంతో పెద్దలప్లి జిల్లా జడ్పి చైర్మన్ పుట్ట మధుకర్ ఆదేశాల మేరకు సర్పంచ్ ఎడ్ల పద్మ బాపు ఆధ్వర్యంలో మంగళవారం లబ్ధిదారునికి ఆ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వేముల రాజేందర్,కార్యకర్తలు వేముల శ్రావణ్, భాషవేణి మల్లేష్,బెల్లం రాజేందర్,దాసరి రమేష్ నాగుల సమ్మయ్య,చీరిపిశెట్టి సమ్మయ్య,గాజుల లింగయ్య, బుద్దార్తి సంపత్,తదితరులు పాల్గొన్నారు.

## మీడియాపై దాడులు అప్రజాస్వామికం

### యునైటెడ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ రమేష్



కరీంనగర్, మార్చి 21 (మనం న్యూస్): రాష్ట్రంలో మీడియా రంగంపై దాడులు జరపడం అప్రజాస్వామికమని యునైటెడ్ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ మొగురం రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్యూ న్యూస్ మీడియా సంస్థ కార్యాలయంపై దాడి చేయడం అమానుషమని, దాడికి పాల్పడిన వారి పై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పత్రికా స్వేచ్ఛను హరించాలని చూస్తే జర్నలిస్టులంతా ఐక్యమై, ప్రజాసంఘాలను, ప్రజాస్వామ్య వాదులను ఏకం చేసి ఉద్యమిస్తామని రమేష్ హెచ్చరించారు. వాస్తవాలను ప్రజలకు తెలిపే బాధ్యత జర్నలిస్టులకు ఉందని పేర్కొన్నారు.

# అధిక పోషక విలువలున్న తృణధాన్యాలను ప్రోత్సహించాలి



జగిత్యాల ప్రతినిధి, మార్చి 21 (మనం న్యూస్): అధిక పోషక విలువలున్న తృణధాన్యాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి వాటిని వాడేలా ప్రోత్సహించాలని జగిత్యాల ఐసిడిఎస్ అర్బన్ సూపర్ వైజర్లు రాణి, స్వరూప రాణి అన్నారు. ఈనెల 20 నుండి ఏప్రిల్ 3 వరకు ప్రాజెక్ట్ స్థాయిలో జరుగుతున్న పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జగిత్యాల పట్టణ మూడవ సెక్టార్ సుతారిపేట్ అంగన్ వాడి కేంద్రంలో అధిక పోషక విలువలు గల మిల్లెట్లపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషణ్ పఖ్వాడ 2023 లో భాగంగా ఆరోగ్యమైన పిల్లల పోటీ వేడుకలు, మిల్లెట్స్ ను ప్రోత్సహించటం, మిల్లెట్స్ ప్రచారం అంశాలపై అన్ని వార్డుల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వార్డులోని ప్రజాప్రతినిధులను ఆహ్వానించి స్థానికంగా లభించే మినుములను ఉపయోగించి సెంటర్ పరిధిలో దంపతులకు వంటల పోటీలు నిర్వహించాలన్నారు. మినుముల, మిల్లెట్స్ లో ఉండే పోషక విలువలను తెలియజేయాల న్నారు. పోషణ్ పఖ్వాడలో మిల్లెట్స్ రకాలు, ఆహారం ప్రాముఖ్యత వైవిధ్యంపై తల్లులకు వివరించాలన్నారు. రక్తహీనత, ఐరన్, విటమిన్-సి లోపం ఏర్పడకుండా ఉండేందుకు అవి అధికముగా ఉండే ఆహారం, మిల్లెట్స్ పై అవగాహన కల్పించాలన్నారు. అన్ని అంగన్వాడి సెంటర్ కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని,పోషణ్ పంచాయతిని ప్రోత్సహించాలన్నారు. పాఠశాలలో రక్తహీనత శిబిరాలు నిర్వహించాలని, అంగన్వాడి కేంద్రం పిల్లలందరి పెరుగుదలపై పర్యవేక్షణ, గ్రోత్ మానిటరింగ్ చేయాలని సూచించారు.రోజు వారి ప్రణాళిక ప్రకారం అన్ని కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో పోషణ్ పక్వాడ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో అంగన్ వాడి టీచర్లు అతియబాను, జె తిరుమల దేవి, శ్రీదేవి, సాజిదా, జరీనా, వార్డు మహిళలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకలు



గంభీరావుపేట, మార్చి 21 (మనం న్యూస్): గంభీరావుపేట మండలం లోని నాగంపేట, దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ముందస్తు శోభకృత్ ఉగాది పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు ముందస్తుగా పంచాంగ వేడుకలను నిర్వహించారు. అనంతరం ఆరు రుచుల మేళ వింపైన ఉగాది పచ్చడిని తయారుచేసి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. విద్యార్థులకు ప్రసాద పంపిణీ చేశారు. విద్యార్థులు చక్కటి ఫలితాల ద్వారాపాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా వక్తలు సూచించారు. ఈ కార్యక్రమం లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లక్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, బోయినగారి నారాయణ, ఎస్ఎంసి చైర్మన్ మామిండ్ల రాజు, ఉపాధ్యాయులు భాస్కరాచారి, వెంకటరమణ, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజ్ కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన వినోద్‌కుమార్, పాడి



జమ్మికుంట, మార్చి 21 (మనం న్యూస్): జమ్మికుంట అర్బన్ బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు టంగుటూరి రాజ్ కుమార్ తల్లి రఫియా మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిలు ఆయన కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి కారణాలను తెలుసుకుని, సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ మాజీ అధ్యక్షులు బచ్చు భాస్కర్ మాతృమూర్తి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ దేశిని స్వప్న కోటి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పొనగంటి మల్లయ్య, పట్టణ సీఐ రామచందర్ రావు, నాయకులు ఎక్కేటి సంజీవరెడ్డి, బొద్దుల రవీందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, కౌన్సిలర్లు పొనగంటి రాము, పొనగంటి సారంగం, గాజుల భాస్కర్, దేశిని సదానందం, రావికంటి రాజు బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు ఏబూసి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు ముద్రగడ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాభవానీ అమ్మవారికి ఘనంగా ఫలపంచామృతాభిషేకం

కరీంనగర్, మార్చి 21 (మనం న్యూస్): కరీంనగర్ మండలం నగునూర్‌లోని పరివార సమేత శ్రీ దుర్గాభవానీ ఆలయంలో అమ్మవారి వసంత నవరాత్రోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమైనాయి. నవరాత్రోత్సవాల్లో భాగంగా వేదపండితులు పురాణం మహేశ్వర శర్మ అమ్మవారికి ఫలపంచామృతాభిషేకం, విశేష అభిషేకం, మహా హారతులిచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నవరాత్రోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన అధ్యాత్మిక ప్రసంగం చేస్తు ఉగాది కాల సంబంధమైన పర్వం కాబట్టి ఆదిత్యుణ్ణి, విశ్వసృజనకు ఆరంభం అయిన సృష్టికర్త బ్రహ్మను ఆరాధించాలన్నారు. శోభకృత్ అంటే ప్రకాశాన్ని కలిగించేదని ఈ సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతుందన్నారు. ఈ పూజల్లో ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణ శర్మ, ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగళ లక్ష్మన్, భక్తులు పాల్గొన్నారు.



## ప్రజా చైతన్య యాత్రను విజయవంతం చేయాలి

### సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రాజిరెడ్డి

శంకరపట్నం, మార్చి 21 (మనం న్యూస్): కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 26న కరీంనగర్ జిల్లాలో నిర్వహించనున్న ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వెల్మారెడ్డి రాజిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం శంకరపట్నం మండల కేంద్రంలో ప్రజా చైతన్య యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలన్నారు. భారతదేశానికి స్వాతంత్రం రాకముందే కార్మికులు అనేక పోరాటాలు నిర్వహించి కార్మిక చట్టాలను తీసుకొచ్చారని, బిజెపి ప్రభుత్వం 39 చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లను చేసిందన్నారు. ఈ విధానం వలన దేశంలో ఉన్న ప్రజల సంపదను దోచి అదాని, అంబానిలకు కట్టబెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 400 రూపాయలు ఉన్న గ్యాస్ ధరను ఇప్పుడు1200 లకు పెంచి ప్రజల పైన భారం వేస్తున్నారని, డీజిల్ పెట్రోల్ ధరలను జిఎస్టి పరిధిలోకి తేవాలని ఆయన సూచించారు. బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ సిపిఎం రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తుందని అందులో భాగంగానే ఉత్తర తెలంగాణలో 23న ప్రారంభమైన ప్రజా చైతన్య యాత్ర ఆసిఫాబాద్, ఆదిలాబాద్,పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల మీదుగా 26వ తేదీన కరీంనగర్ చేరుకుంటుందన్నారు. కరీంనగర్‌లోని తెలంగాణ చౌరస్తా వద్ద మధ్యాహ్నం 12 గంటలకు సభ, అనంతరం రోడ్ షో కోతిరాంపూర్ లోని అన్నమనేని గార్డెన్ లో బహిరంగ సభ ఉంటుందని రాజిరెడ్డి వివరించారు. ఈ ప్రజా ప్రజా చైతన్య యాత్రలో ప్రజా సంఘాలు, మేధావులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎడ్ల రమేష్, ట్రాలీ యూనియన్ మండల అధ్యక్షులు వంగ బిక్షపతి, నాయకులు శ్రీనివాస్, క్రాంతి కుమార్, శ్రీకాంత్, మురళి, అంజి, రాజు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది పచ్చడికి, వేప పూత కరవు

### ఓబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్



ఇల్లందకుంట, మార్చి 21 (మనం న్యూస్): తెలుగు ప్రజల నూతన సంవత్సరాది ఉగాది పర్వదినం సందర్భంగా తయారు చేసే పచ్చడికి వేపపూవు కరవవడం శోచనీయమని ఓబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉగాది సందర్భంగా పచ్చడి ప్రాముఖ్యత అంతా అంతా కాదని, జీవితంలోని అనుభవాలను రంగరించి చేసేదే ఉగాది పచ్చడని తెలిపారు. వేప చెట్టుకు వైరస్ రావడం వలన అనేక అనుమానాలకు తావిస్తుందని పేర్కొన్నారు. భారతదేశంపై ప్రపంచ దేశాలకు మొదటి నుంచి కక్షపూరితమైన ఆలోచనతో1983 సంవత్సరంలోనే దేశంలోని వేప చెట్లపై అమెరికా పేటెంట్ కావాలని అడగడం, అప్పుడు మన ప్రభుత్వం వ్యతిరేకించిందని గుర్తు చేశారు. మారుతున్న కాలంలో భారత్‌లో వేప చెట్లు లేకుండా కక్ష సాధిస్తూ కొత్త వైరస్ ని కేవలం వేప చెట్లపైనే ప్రయోగించడం మన ఉగాది పండుగ పై ప్రభావం పడుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. సర్వరోగానికి ఆయుర్వేద మందులు వేపను ఉపయోగిస్తూ, ఉగాది పచ్చడి కూడా ఉపయోగిస్తామని, కానీ కొత్త వైరస్ రావడం వలన వేప పూలు ఉపయోగించాల లేదా అనే అనుమానాలు ప్రజల్లో తలెత్తాయని రాజేందర్ పేర్కొన్నారు. ఈ విషయమై ఏ శాస్త్రవేత్త కూడా సరైన సమాధానం చెప్పలేకపోతున్నారని తెలిపారు.

## పంటలు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

### డిసిసి అధికార ప్రతినిధి మధుకర్



శంకరపట్నం, మార్చి 21 (మనం న్యూస్ ): అకాల వర్షాలకు శంకరపట్నం మండలంలోని పలు గ్రామాల్లో పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఊకంటి మధుకర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 30 నుంచి 40 వేల వరకు నష్ట పరిహారం అందించాలన్నారు. అధికారులు సమగ్ర విచారణ చేసి సకాలంలో నివేదిక పంపించాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కొరెం రాజిరెడ్డి, కల్లేపల్లి రాజయ్య, నేలవేణి బుచ్చయ్య, తుమ్మేటి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ చేతుల మీదుగా పారమిత విద్యార్థిని శుభశ్రీకి యువ ఉగాది పురస్కారం




కరీంనగర్ కలెక్టరేట్, మార్చి 21 (మనం న్యూస్): కరీంనగర్‌లోని పారమిత పాఠశాల విద్యార్థిని శుభశ్రీ రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ చేతుల మీదుగా యువ ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన యువతీ, యువకులకు అందించిన ఉగాది పురస్కారాలలో భాగంగా వ్యవసాయ రంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టి బహుళ పనులు చేసే పర్యావరణ స్నేహపూర్వక వ్యవసాయ యంత్రాన్ని తయారు చేసిన బాల ఆవిష్కర్త శుభ శ్రీ సాహు ని రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ యంగ్ అచీవర్ అవార్డు తో సత్కరించారు. రాజ్ భవన్ లో నిర్వహించిన ముందస్తు శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలలో భాగంగా స్థానిక కరీంనగర్ లోని పద్మనగర్ పారమిత పాఠశాలకు చెందిన 9 వ తరగతి విద్యార్థిని శుభ శ్రీ సాహు యువ ఉగాది పురస్కారాన్ని అందు కుందని పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా ఇ.ప్రసాదరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ దంపతులు, గవర్నర్ తమిళి సై దంపతులు, ప్రముఖులు, యువతీయువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యంగ్ అచీవర్ అవార్డు సాధించిన శుభ శ్రీ ని, గైడ్ టీచర్ లలిత్ మోహన్ సాహు ని పారమిత డైరెక్టర్లు రశ్మిత, అనూకర్ రావు, ప్రసూన , వి.యు.యం ప్రసాద్, రాకేశ్, వినోద్ రావు, ప్రినిపాల్ సంజయ్ భట్టాచార్య, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకం గా అభినందించారు.

## జన చైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరణ




ఇల్లందకుంట, మార్చి 21 (మనం న్యూస్): సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జన చైతన్య యాత్ర పోస్టర్‌ను మండల కేంద్రంలో పార్టీ జోన్ కమిటీ సభ్యులు చేల్పూరి రాములు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23న ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభం అవుతుందని, 26న కరీంనగర్ జిల్లా కు జన చైతన్య యాత్ర చేరుకుంటుందని తెలిపారు. బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక కార్మిక, రైతాంగ, వ్యవసాయ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలన్నారు. అంబానీ, ఆధాని లాంటి కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ దేశ ప్రజలను హిందుత్వ పేరుతో విభజించి తన మిత్రుల సంపాదన కోసం గ్యాస్, పెట్రోల్, నిత్యావసర వస్తువుల, ధరలను బిజెపి ప్రభుత్వం పెంచుకుంటూ పోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించనున్న జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ కమిటీ సభ్యులు తిప్పారబోయిన శ్రీకాంత్, కొత్తూరి మల్లయ్య, వెంకన్న, రాజు, సమ్మయ్య, ఎల్లయ్య, సారయ్య పాల్గొన్నారు.

## గ్రామీణ పేదల సంఘం మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



రాజన్న సిరిసిల్ల, మార్చి 21 (మనం న్యూస్): ఈ నెల 24, 25వ తేదీల్లో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో నిర్వహించనున్న గ్రామీణ పేదల సంఘం మహాసభ వాల్ పోస్టర్‌ను సంఘం నాయకులు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ పేదల సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తాటిపాముల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ మహాసభలకు జిల్లా నుండి నాయకులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి జింక శ్రీనివాస్, కట్కూరి దేవేందర్ పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డితో ఛాలెంజ్ చేసే స్థాయి సునీల్ రావుకు లేదు

**బిఆర్ఎస్ ప్రభుత్వానికి దమ్ముంటే గ్రూప్ వన్ పరీక్షల మార్కులు వెల్లడించాలి**

**కరీంనగర్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి**

కరీంనగర్, మార్చి 21 (మనం న్యూస్): టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డితో ఛాలెంజ్ చేసే స్థాయి మేయర్ సునీల్‌రావుది కాదని, బిఆర్ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గ్రూప్ వన్ పరీక్షల మార్కుల జాబితా బహిర్గతం చేయాలని నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరుసగా నాలుగు పోటీ పరీక్షలు లీకేజి కారణంగా రద్దు చేసిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వందే అని ఎద్దేవా చేశారు. కొన్ని లక్షల మంది నిరుద్యోగుల ఆత్మ స్థైర్యం దెబ్బతీయడమే కాకుండా వారిని అన్ని రకాలుగా నష్టపరిచిన బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కెటీఆర్ పిఎ తిరుపతి సొంత మండలమైన మల్యాలలో వందమందికి పైగా అభ్యర్థులకు వందమార్కులకంటే ఎక్కువ వచ్చాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారని గుర్తు చేశారు. గ్రూప్1 పరీక్షల మార్కుల జాబితా బయట పెడితే బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలా వద్దా తేలుతుందని పేర్కొన్నారు. కరీంనగర్ కార్పొరేషన్లో జరుగుతున్న అవినీతి కుంభకోణాలకు బాధ్యత వహించాల్సింది మేయర్‌ది కాదా అని ప్రశ్నించారు. ఒక వైపు అకాల వర్షాలతో రైతులు నష్టపోయి ఉంటే పంట నష్ట పరిహారం గురించి మాట్లాడ కుండా, ఇంకో వైపు ప్రశ్న పత్రాల లీకేజీలతో ఆందోళనతో ఉన్న నిరుద్యోగు లకు భరోసా ఇవ్వకుండా బిఆర్ఎస్ నాయకులు ఆత్మీయ సమ్మేళనాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గుండాటీ శ్రీనివాస్ రెడ్డి, లింగంపల్లి బాబు, కుర్ర పోచయ్య, బాలబద్రి శంకర్, దన్న సింగ్, షబానా మహమ్మద్, పోరండ్ల రమేష్, షేక్ శేహెన్షా, మామిడి సత్యనారాయణ రెడ్డి, మెతుకు కాంతయ్య, ఇర్ఫాన్, ముక్క భాస్కర్, ముల్కల కవిత, ఎగ్గడి శారద, అష్రాఫ్, హనీఫ్ పాల్గొన్నారు.



## భవన నిర్మాణ కార్మికుల సదస్సును విజయవంతం చేయాలి

**సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్**



ఇల్లందకుంట, మార్చి 21 (మనం న్యూస్): కరీంనగర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్న భవన నిర్మాణ కార్మికుల సమావేశాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జంబుకం వెంకన్న అధ్యక్షతన భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రమేష్ మాట్లాడుతూ సమావేశానికి అన్ని గ్రామాల నుండి భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా ఇల్లందకుంట మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా కొప్పుల శంకర్, అధ్యక్షులుగా చిరువేలు కొమురయ్య, ప్రధాన కార్యదర్శిగా రావుల ఎల్లయ్య, కోశాధికారిగా గోనె రమేష్, ఉపాధ్యక్షులుగా రేణిగుంట సారయ్య కృష్ణమూర్తి సమ్మయ్య మాలాద్రి చిన్న ఎల్లయ్య సహాయ కార్యదర్శులుగా గజరవేణి గోపాల్ రాజ కొమురయ్య జనార్ధన్ సమ్మయ్య సాది కమిటీ సభ్యులుగా ఏడు మందిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చిలుకూరి రాములు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎల్లయ్య, కొమురయ్య, సారయ్య, సాగర్, సారంగం, కార్మికులు పాల్గొన్నారు.

## ఎల్ఓసి అందించిన ఎమ్మెల్యే రసమయి



ఇల్లంతకుంట, మార్చి 21 (మనం న్యూస్): ప్రమావదశాత్తు గాయపడి, నిమ్స్ హస్పిటల్ చికిత్స పొందుతున్న పెద్ద లింగాపూర్ గ్రామానికి చెందిన తిప్పారపు శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు రెండు లక్షల 50వేల రూపాయల విలువైన ఎల్ఓసిని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొడిశెల జితేందర్ గౌడ్, నాయకులు మీసరగండ్ల అనిల్ కుమార్, బొప్ప శ్రీనివాస్, మీసేవ చారి తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి మిత్ర బృందం చేయూత



జగిత్యాల ప్రతినిధి, మార్చి 21( మనం న్యూస్ ): క్యాన్సర్ తో బాధపడుతూ కరీంనగర్ లోని ప్రైవేటు హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న రిత్విక్ అనే బాబుకు జగిత్యాల ఎస్ కేఎన్ఆర్ బికాం 1994-97 బ్యాచ్ మిత్ర బృందం 30వేల500 రూపాయల ఆర్థిక సహాయం అందించారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రంగధామునిపల్లి గ్రామానికి చెందిన రాగళ్ల తిరుపతి రవళి దంపతులు పెద్దబ్బాయి రిత్విక్ బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతుండగా ట్రీట్మెంట్ కోసం కరీంనగర్ లోని ప్రైవేట్ హాస్పిటల్ లో చేర్పించారు. బాబు వైద్యానికి 40 లక్షల రూపాయలు ఖర్చు అవుతాయని డాక్టర్లు చెప్పడంతో పేద కుటుంబానికి చెందిన తల్లిదండ్రులు ఆవేదనతో తన బిడ్డను ఎలాగైనా బతికించుకోవాలని ఆపన్న హస్తం కోసం దాతల నుంచి సహాయం కొరకు ఎదురుచూస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న జగిత్యాల ఎస్‌కేఎన్ఆర్ కళాశాల బికాం 1994-97 బ్యాచ్ మిత్ర బృందం ఆర్థిక సహాయం అందించి బాసటగా నిలిచారు. ఇంకా దాతలు ముందుకు వచ్చి బాబును ఆదుకోవాలని వారు కోరుతున్నారు . దాతలు ఎవరైనా 91213 94906 ఫోన్ నెంబర్ ను సంప్రదించి రిత్విక్ కు కొత్త జీవితం ప్రసాదించాలని తల్లిదండ్రులతో పాటు వారు అభ్యర్థిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వొడ్నాల రాజశేఖర్, వుటూరి రమేష్, చిట్టి మల్ల రఘు, లింగమూర్తి, పైన్ల రాజేశం, దుమాల శివ, ఎదులపురం లక్ష్మన్, నిర్మల, హరిప్రియ, శివరామకృష్ణ, సునీత, రాగి లక్ష్మినారాయణలు పాల్గొన్నారు.

# కరీంనగర్‌ను గొప్ప నగరంగా తీర్చిదిద్దుతాం

## మంత్రి గంగుల కమలాకర్

## సెంట్రల్ లైటింగ్ ప్రారంభించిన మంత్రి

కరీంనగర్ బ్యూరో, మార్చి 21 (మనం న్యూస్)ః కరీంనగరాన్ని గొప్పనగరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర బిసి సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్‌లోని కమాన్ చౌరస్తా నుండి కేబుల్ బ్రిడ్జి వరకు 90 లక్షల రూపాయల స్మార్ట్ సిటీ నిధులతో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన సెంట్రల్ లైటింగును ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సమైక్య పాలనలో అప్పటి పాలకులు రోడ్డు వేసిన పాపాన పోలేదని, దీంతో నగరం అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిందని, స్వయం పాలనలో ఇప్పుడు ప్రతి డివిజన్లో అభివృద్ధి పనులు గొప్పగా సాగుతున్నాయన్నారు. నగర వాసులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు వందలాది కోట్ల రూపాయల నిధులను వెచ్చించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు నగరంలోని 60 డివిజన్లలో 80 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయని మిగతా పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగర ప్రజలకు 24 గంటల తాగు నీటి సరఫరా, కరెంట్, మౌలిక వసతుల కల్పనే మా లక్ష్యమని ఇందుకోసం ఎన్ని నిధులైనా వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.




మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

కావలెను

'మనం' తెలుగు దినపత్రికకు ఈ దిగువ పేర్కొన్న సర్కిల్స్ పరిధిలో విలేకరులుగా పనిచేసేందుకు ఉత్సాహవంతులు కావలెను. చక్కటి రాత, తెలుగుభాషపై పట్టు ఉండి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు కోరబడుతున్నవి.

కావలసిన ప్రాంతాలు :

కరీంనగర్ జిల్లా : కరీంనగర్ క్రైమ్, గంగాధర, గన్నేరువరం, మానకొండూర్ రూరల్.

జగిత్యాల జిల్లా : జగిత్యాల టౌన్, జగిత్యాల రూరల్, ఎడ్యూకేషన్, దరూర్ క్యాంపు, మేడిపల్లి, ఇబ్రహీంపట్నం, కథలాపూర్, సారంగాపూర్, గొల్లపల్లి, మల్యాల, ఎండపల్లి,

రాజన్న సిరిసిల్ల జిల్లా : సిరిసిల్ల క్రైమ్, సిరిసిల్ల ఆర్.సి., రుద్రంగి, చందుర్తి, వేములవాడ టౌన్, వేములవాడ రూరల్, వేములవాడ ఆర్.సి., ముస్తాబాద్.

పెద్దపల్లి జిల్లా : పెద్దపల్లి / ఆర్.సి., టౌన్, రూరల్, రామగుండం, కోల్‌సిటి, జూలపల్లి, ఓదెల, పాలకుర్తి, అంతర్గాం, 8ఇన్ క్లైయిన్ కాలని, బసంత్‌నగర్.

మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యాలయం
ఇ.నెం. 1-6-169, మమత థియేటర్ ప్రక్కన,
కలెక్టరేట్ రోడ్, భగత్‌నగర్, కరీంనగర్.

కె. తిరుపతి రెడ్డి
బ్యూరో ఇంచార్జ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా
సెల్ : 83339 98076